


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 201 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల శుక్రవారం 27 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 201 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA FRI 27 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రామరాజ్య స్థాపనకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి

- శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు
- ధర్మానికి, సుపరిపాలనకు శ్రీరాముడు ప్రతీక అని వ్యాఖ్య
- ప్రజారంజక పాలన అందించే రామరాజ్యాన్ని స్థాపిద్దామని పిలుపు
- శ్రీరాముడి సుగుణాలతో ఆదర్శ జీవితం గడపాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్:నేడు (మార్చి 27) శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ధర్మానికి, సుపరిపాలనకు శ్రీరామచంద్రుడు ప్రతీక అని కొనియాడారు. ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడైన శ్రీరాముడు అవతరించిన, ఆయన కల్యాణం జరిగిన పవిత్రమైన రోజే శ్రీరామనవమి అని చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఒక సందేశం విడుదల చేశారు. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన అని, రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి

- మిగతా2లో



### ఏపీ బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..

**మృతులకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటన**

- మార్కాపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొని మంటలు వ్యాపించిన ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో 14 మంది సజీవ దహనం.. మరో 22 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం ప్రకటించిన పీఎంఓ

### టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

### ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘటన

# 14 మంది సజీవ దహనం

- 23 మందికి గాయాలు వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- కిటికీ అద్దాలు పగులగొట్టి బయటపడ్డ కొందరు
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ఘటన
- మృతుల్లో ఇద్దరు జగిత్యాల జిల్లా రాయికల్ వాసులు

02

## సజ్జల మాటలు వింటుంటే నవ్వొస్తోంది



- అమరావతికి మద్దతిస్తామన్న సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదమన్న కాల్వ శ్రీనివాసులు
- వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే జగన్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించాలని డిమాండ్
- గతంలో రాజధానిని శ్మశానంతో పోల్చిన విషయాన్ని గుర్తుచేసిన టీడీపీ
- ప్రజల దెబ్బతోనే వైసీపీకి ఇప్పుడు అమరావతి గుర్తొచ్చిందని విమర్శ
- చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడి

- మిగతా2లో

## అమరావతికి చట్టబద్ధత కల్పించేలా ఏపీ క్యాబినెట్ తీర్మానం

- కీలక అంశాలపై ఏపీ క్యాబినెట్ తీర్మానాలు ఇవే!
- అమరావతికి చట్టబద్ధ హోదా కల్పించాలని కేబినెట్ తీర్మానం
- పునర్విభజన చట్టం సవరణ కోసం అసెంబ్లీలో తీర్మానానికి ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ఆస్తి పన్ను వడ్డీ మాఫీ, పలు సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం
- వడ్డెర సంఘాలకు ఖనిజ లీజుల్లో 50 శాతం రాయితీకి ఆమోదం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఏపీ కేబినెట్ సమా వేశంలో రాజధాని అమరావతికి సంబం ధించి అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకు న్నారు. అమరావతికి చట్టబద్ధమైన హోదా కల్పించేందుకు ఉద్దేశించిన తీర్మానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని కోసం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించి, కొత్త రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28న జరగనున్న ప్రత్యేక శాసనసభ సమావేశంలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదం తెలుపనున్నారు. అనంతరం, పునర్విభజన చట్టంలో సవరణల కోసం ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఈ చర్యతో అమరావతి రాజధానికి చట్టపరమైన భద్రత లభించనుంది. ఈ సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో కొత్తగా 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, నీరుకొండలో

- మిగతా2లో





## సీఎంపై వ్యాఖ్యలు: జోగి రమేశ్‌కు పోలీసుల నోటీసులు

- మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్‌పై కొత్త కేసు
- సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- బాపట్ల జిల్లా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- వారం రోజుల్లో విచారణకు రావాలని పోలీసుల నోటీసులు
- గత నెలలోనూ అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు మరో కేసు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు పోలీసు లు నోటీసులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్ర బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల తో బాపట్ల జిల్లా

- మిగతా2లో

## అబుదాబిపై ఇరాన్ క్షిపణి దాడి .. శకలాలు మీద పడి భారతీయుడి మృతి

- అబుదాబిలో కూల్చివేసిన క్షిపణి శకలాలు పడి ప్రమాదం
- ఈ ఘటనలో ఒక భారతీయుడు, ఒక పాకిస్థానీ మృతి
- మరో భారతీయుడితో పాటు ముగ్గురికి గాయాలు
- ఇరాన్ నుంచే దాడులు జరుగుతున్నాయని యూఏఈ వెల్లడి
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావమే ఈ ఘటన



పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు విషాదానికి దారితీశాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో గురువారం జరిగిన ఓ ఘటనలో ఒక భారత జాతీయుడు ప్రాణాలు

- మిగతా2లో



## ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల తీరుపై ట్రంప్ ఆగ్రహం

- ఇరాన్ మిలిటరీ నష్టపోయిందన్న ట్రంప్
- నాటో దేశాల నుంచి ఎలాంటి సహకారం లేదన్న ట్రంప్
- కీలక సమయంలో వారు ప్రవర్తించిన తీరు గుర్తుంచుకుంటామన్న ట్రంప్

పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల నుంచి ఎలాంటి మద్దతు లభిం చడంలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల పాటు జరిగిన యుద్ధంలో

- మిగతా2లో

## అమరావతే శాశ్వత రాజధాని...

### ఏపీ క్యాబినెట్ సమావేశం పూర్తి వివరాలు....



- అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించడం కోసం అసెంబ్లీ తీర్మానానికి క్యాబినెట్ ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త కోర్టుల ఏర్పాటు, 1730 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- వడ్డెర సంఘాలకు క్వారీ లీజుల్లో ప్రాధాన్యత, రుసుముల్లో 50 శాతం రాయితీ
- పురపాలికల్లో ఆస్తిపన్ను వడ్డీ బకాయిల పూర్తి మాఫీకి కీలక నిర్ణయం
- ప్రైవేట్ కోచింగ్ సంస్థల నియంత్రణకు కొత్త నిబంధనలకు మంత్రిమండలి ఆమోదం

- మిగతా2లో

### ప్రపంచంలో మోస్ట్ పాప్యులర్ నేతగా ప్రధాని మోదీ...

## పొంగిపోతున్న బీజేపీ నేతలు

- అమెరికా సంస్థ సర్వేలో ప్రధాని మోదీకి అగ్రస్థానం
- 68 శాతం అప్రూవల్ రేటింగ్‌తో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా గుర్తింపు
- ఇది దేశానికి గర్వకారణమంటూ బీజేపీ నేతల హర్షం
- మోదీ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రతిష్ట పెరిగిందని వ్యాఖ్య
- సర్వే ఫలితాలను స్వాగతిస్తూ పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రుల అభినందనలు

- మిగతా2లో



## అన్ని రాష్ట్రాల సీఎంలతో నేడు మోదీ సమావేశం

- పశ్చిమాసియా యుద్ధం.. నేడు ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ కీలక సమావేశం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్న ప్రధానమంత్రి
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడనున్న మోదీ
- సంక్లిష్ట పరిస్థితులు సుదీర్ఘంగా కొనసాగే అవకాశముందన్న ప్రధాని

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

### ధరల పెంపు - హరిత పరిష్కారం

యుద్ధాలు ఎప్పుడు వస్తాయో మనం ముందుగా కనుక్కోవడం కష్టమే, కానీ వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి మనల్ని మనం కాపాడుకోగలం. హరిత ఇంధనాల వినియోగం అనేది కేవలం పర్యావరణ హితం మాత్రమే కాదు, అది మన దేశ భద్రతకు సామాన్యుడి జేబుకు శ్రీరామరక్ష. యుద్ధ మేఘాల చాటున భారత్ స్వయం సమృద్ధి దిశగా నడవాలంటే హరిత పరిష్కారమే మార్గం. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ యుద్ధం ప్రభావం కేవలం ఆ దేశాలకే పరిమితం కాకుండా, గల్ఫ్ రీజియన్ నుండి ముడి చమురు దిగుమతులపై ఆధారపడే మన భారత్ వంటి దేశాలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110-120 డాలర్లు దాటిపోవడంతో, మన దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. భవిష్యత్తులో మరే ఇతర ప్రపంచ యుద్ధాలు వచ్చినా మన ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కాకుండా ఉండాలంటే, మనం విదేశీ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించి, ప్రకృతి సిద్ధమైన 'హరిత ప్రత్యామ్నాయాల' వైపు మళ్లడం అత్యవసరం. ముందుగా రవాణా రంగంలో 'ఎలక్ట్రిక్ విప్లవం' రావాలి. పెట్రోల్ ధర వంద దాటిన వేళ, ఎలక్ట్రిక్ వాహనం (ఇఎ) వాడటం వల్ల కిలోమీటరుకు కేవలం 15 నుండి 20 పైసలే ఖర్చవుతుంది. ప్రభుత్వం అందిస్తున్న ఖఓ ఇ-ఆఖీఎఎఇ వంటి పథకాల ద్వారా ఎలక్ట్రిక్ టూ-వీలర్లపై దాదాపు 10,000 నుండి 30,000 వరకు రాయితీ లభిస్తోంది. ఇంధన కొరతను ఎదుర్కోవడానికి ఇది అత్యంత సులభమైన మార్గం. కేవలం వాహనాలే కాదు, మన ఇళ్లలో కూడా మార్పు రావాలి. 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం' ద్వారా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే, నెలవారీ కరెంటు బిల్లుల నుండి విముక్తి లభిస్తుంది. 3 కిలోవాట్ల వరకు సోలార్ సిస్టమ్ పెట్టితే ప్రభుత్వం సుమారు 78,000 వరకు సబ్సిడీ ఇస్తోంది. దీనివల్ల మన సొంత విద్యుత్తు మనమే తయారు చేసుకోవచ్చు, తద్వారా చమురుతో తయారయ్యే థర్మల్ పవర్ పై భారం తగ్గుతుంది. మరో అద్భుతమైన ప్రత్యామ్నాయం 'ఇథనాల్ బ్లెండింగ్'. మన రైతులు పండించే చెరకు వ్యర్థాల నుండి తీసే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే ముడి చమురు అవసరం తగ్గుతుంది. ఇప్పటికే మన దేశం 15% నుండి 20% వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను విజయవంతంగా వాడుతోంది. ఇది రైతులకు ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా, పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుంది. భవిష్యత్తు ఇంధనంగా పిలవబడే 'గ్రీన్ హైడ్రోజన్' వైపు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. యుద్ధాల వల్ల గ్యాస్ సరఫరా నిలిచిపోయినా, నీటి నుండి ఉత్పత్తి చేసే ఈ హైడ్రోజన్ మన పరిశ్రమలకు, భారీ ట్రక్కులకు ఇంధనంగా మారుతుంది. ఇది పొగను విడుదల చేయదు, కేవలం నీటి ఆవిరిని మాత్రమే బయటకు పంపిస్తుంది. ముగింపుగా, యుద్ధాలు ఎప్పుడు వస్తాయో మనం ముందుగా కనుక్కోవడం కష్టమే, కానీ వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి మనల్ని మనం కాపాడుకోగలం. హరిత ఇంధనాల వినియోగం అనేది కేవలం పర్యావరణ హితం మాత్రమే కాదు, అది మన దేశ భద్రతకు సామాన్యుడి జేబుకు శ్రీరామరక్ష.

## అబుదాబిపై ఇరాన్ క్షిపణి దాడి .. శకలాలు మీద పడి భారతీయుడి మృతి

- మొదటి పేజి తరువాయి

కోల్పోయారు. మరొక భారతీయుడు గాయపడ్డారు. గగనతలంలో పేల్చివేసిన బాలిస్టిక్ క్షిపణికి చెందిన శకలాలు జనావాసాలపై పడటంతో ఈ ఘోరం జరిగింది. ఈ దుర్ఘటనలో మొత్తం ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై అబుదాబి మీడియా ఆఫీస్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు ఓ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డగించి కూల్చివేశాయని తెలిపింది. అయితే, ఆ క్షిపణి శకలాలు అబుదాబిలోని స్వీహాన్ వీధిలో పడ్డాయని పేర్కొంది. ఈ ప్రమాదంలో ఒక భారత, ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించారని ధృవీకరించింది. గాయపడిన ముగ్గురిలో ఒక యూఏఈ, ఒక జోర్డాన్, ఒక భారత జాతీయుడు ఉన్నారని, వారికి చికిత్స అందిస్తున్నామని వివరించింది. ఈ ఘటనలో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.
పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఘర్షణల పర్యవసానంగానే ఈ దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, వారి మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతోంది.
ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వినిపిస్తున్న భారీ శబ్దాలు క్షిపణులను అడ్డగించడం వల్లే వస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ప్రజలు అనవసరపు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అబుదాబి అధికారులు విజ్ఞప్తి చేశారు.

# టిప్పర్ ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు 14 మంది సజీవ దహనం

హైదరాబాద్/అమరావతి: ఆంధ్రప్రదేశ్ లోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 14 మంది సజీవ దహనమ య్యాయి. 23 మంది గాయపడ్డారు. ఇవాళ ఉదయం మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో కంకర లోడుతో వస్తున్న టిప్ప రన్ను హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. హరికృ ష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పలకల క్వారీల మలుపు వద్ద చీమకుర్తి నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్ను ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగగా, బస్సు పూర్తిగా దగ్ధంఅయింది. ఈ దుర్ఘటనలో ఘటన స్థలంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమ య్యారు. బస్సు క్యాబిన్లో గుర్తు పట్టలేని విధంగా నాలుగు మృతదేహాలు ఉన్నాయి. బస్సు ప్రమాదం సమయంలో 40మంది ప్ర యాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం తో అప్రమత్తమైన స్థానికులు, ఘటనా స్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల ను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

**క్షణాల్లో చెలరేగిన మంటలు**

వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. టిప్పర్ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే బస్సులో మంటలు వ్యాపించాయి.ప్రమాదంతో బస్సు అద్దాలు పగలగొట్టి కొందరు ప్రయాణికులు కిందకి దూకారు. స్లీపర్ బస్సు కావడంతో బయటపడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మృతుల్లో ఎక్కువ మంది స్లీపర్ బెర్తులపై ఉన్నవాళ్లేనని తేలింది. బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బస్సు ప్రమాదంపై మార్కాపురం డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ.. మృతదేహాలను బయటకు తీసేందుకు. ప్రయత్నిస్తున్నామని, గాయపడ్డవారికి మార్కాపురం ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని చెప్పారు.

**ఏపీ బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..**

ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో భారీ అగ్నిప్రమాదం సంభవించి 14 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని పరిహారం ప్రకటించారు. "ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ప్రమాదం చాలా విషాదకరం. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (PMNRF) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) 'ఎక్స్'లో వెల్లడించింది.

## సజ్జల మాటలు వింటుంటే నవ్వొస్తోంది

అమరావతికి తమ పార్టీ మద్దతిస్తుందంటూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయని, ఇది ఆ పార్టీకి ఒక ఆత్మహత్యా సదృశ్యమని ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తీవ్రంగా విమర్శించారు. గత ఐదేళ్లుగా అమరావతిని శ్మశానంతో పోల్చి, నిర్మాణాన్ని అడుగడుగునా అడ్డుకున్న వైసీపీ.. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు కొట్టిన చెంపదెబ్బతో ఇప్పుడు దారిలోకి వస్తున్నట్లు నటిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. గురువారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్టీ అధ్యక్ష పదవిలో లేని సజ్జల, ఒక విధానపరమైన నిర్ణయాన్ని ఎలా వెల్లడిస్తారని కాల్వ శ్రీనివాసులు ప్రశ్నించారు. అమరావతి విషయంలో వైసీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి "మేం అమరావతికి మద్దతు ఇస్తున్నాం" అని సూటిగా, స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ మౌనం వీడనంత వరకు సజ్జల మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. అమరావతి ద్రోహులు వైసీపీ నాయకులేనని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గతంలో రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా, శాంతియుతంగా పోరాటం చేస్తున్న రైతులు, మహిళలపై వైసీపీ ప్రభుత్వం చేసిన దాడులను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని కాల్వ గుర్తుచేశారు. ఇప్పుడు మాట మార్చి చిలకపలుకులు పలికితే ప్రయోజనం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో అమరావతి నిర్మాణం నేడు శరవేగంగా సాగుతోందని,

ఇది చూసి వైసీపీ నేతలు ఈర్ష్య పడుతున్నారని వ్యాఖ్యానించారు.అమరావతిని నాశనం చేయాలని చూసినందుకే ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పారని కాల్వ అన్నారు. సజ్జల ఎన్ని వంకర మాటలు మాట్లాడినా, రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ప్రజలు రాజకీయ సమాధి కట్టడం ఖాయమని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న సీట్లు కూడా గెలవడం కష్టమేనని జోస్యం చెప్పారు. అమరావతికి చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తంగా వైసీపీ నాయకులు తమ తప్పులను ఒప్పుకుని, రాజధాని నిర్మాణానికి బేషరతుగా మద్దతు ప్రకటించాలని ఆయన స్పష్టం చేశారు.

# అమరావతే శాశ్వత రాజధాని...

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలే లక్ష్యంగా సుదీర్ఘంగా చర్చించి అనేక అంశాలను ఆమోదిం చారు. అమరావతిని శాశ్వత రాజధానిగా సుస్థిరం చేసేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం, న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ 96 కొత్త కోర్టులు, 1730 ఉద్యోగాలను సృష్టించడం, వడ్డెర సామాజిక వర్గానికి క్వారీల్లో రిజర్వేషన్లు, ఆస్తిపన్ను వడ్డీ మాఫీ వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**అమరావతికే శాశ్వత రాజధాని హోదా!**

అమరావతి రాజధాని విషయంలో భవిష్యత్తులో ఎలాంటి మార్పులకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా సెక్షన్ 5(2)లో "ఎట్ అమరావతి" అనే పదాన్ని, అలాగే అమరావతి అంటే ఏపీసీఆర్‌డీఏ చట్టం కింద నోటిఫై చేసిన ప్రాంతం అని స్పష్టంగా చేర్చాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో సృష్టించిన గందరగోళం పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజకీయ కక్ష సాధింపులతో రాజధానిని మార్చే దుశ్చర్యలకు పాల్పడ కుండా, అమరావతిని శాశ్వత రాజధానిగా, ఆర్థిక శక్తిగా తీర్చిది ద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి వివరించారు.

**న్యాయవ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగు**

రాష్ట్రంలో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో న్యాయవ్యవస్థను బలోపేతం చేసేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. హైకోర్టు ప్రతిపాదన మేరకు రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త కోర్టులను (అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, సివిల్ జడ్జ్ కోర్టులు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కోర్టుల నిర్వహణకు అవసరమైన 1,730 కొత్త పోస్టుల సృష్టికి కూడా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి 10 లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు ఉండాలనే నిబంధన, ఐదేళ్లకు మించి కేసులు పెండింగ్‌లో ఉండకూడదనే ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019లో ఒక్కో జడ్జిపై 963 కేసుల భారం ఉండగా, 2025 నాటికి అది 1,474 కేసులకు పెరిగిన విషయాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ 1,730 పోస్టులను త్వరలో విడుదల చేసే జాబ్ క్యాలెండర్‌లో చేర్చే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**వడ్డెరలకు చేయూత.. బీసీ వర్గాలకు ప్రోత్సాహం**

బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు చారిత్రక నిర్ణయం తీసుకుంది. వడ్డెర సంఘాలకు క్వారీ లీజులను ప్రాధాన్యత ప్రాతిపదికన కేటాయించడంతో పాటు, ప్రీమియం, సీనరేజ్ ఫీజులో 50% రాయితీ ఇవ్వడానికి రూపొందించిన మార్గదర్శకాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 15 శాతం వారికి రిజర్వ్ చేయనున్నారు. అనాదిగా మట్టి, రాతి పనులపై ఆధారపడి జీవిస్తున్న వారి వృత్తిని ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, అవసరమైతే వారికి పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించేలా కూడా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పేర్కొన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులకు నిధులు.. కీలక అనుమతులు**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఫేజ్-1లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి, పొంగనూరు బ్రాంచ్ కెనాల్ నిర్మాణంలో పెరిగిన అంచనా వ్యయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లాలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ కింద 7 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల నిర్వహణకు రూ.4.40 కోట్లు మంజూరు చేసింది. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కోసం భూసేకరణలో భాగంగా భూమి ధరను ఎకరాకు రూ.4.20 లక్షలకు పెంచారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పరిహారం అందనుంది. ఇందుకోసం రూ.565 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

**ఇంధన రంగంలో భారీ సంస్కరణలు, భూ కేటాయింపులు**

ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో పైపుడ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. దీపం పథకం కింద ఇచ్చే రూ.2,400 సబ్సిడీని పీఎన్‌జీ కనెక్షన్ తీసుకున్న వారికి కూడా డీబీటీ ద్వారా ఆరు వాయిదాల్లో అందించనున్నారు. నంద్యాల జిల్లాలో విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎకోరియన్ ఎనర్జీ సంస్థకు ప్రభుత్వ భూములను లీజుకు కేటాయించారు. అలాగే కడప, కర్నూలు జిల్లాల్లో 1000 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పార్కుల ఏర్పాటుకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు.

**ఆస్తిపన్ను వడ్డీ మాఫీ.. కోచింగ్ సెంటర్లపై నియంత్రణ**

ప్రజలకు ఊరట కల్గిస్తూ పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలో ఆస్తిపన్ను బకాయిలపై పేరుకుపోయిన వడ్డీని ఒకేసారి మాఫీ చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇది వర్తిస్తుంది. దీనివల్ల 123 మున్సిపాలిటీల్లో రూ.2,409 కోట్ల బకాయిల వసూలు సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
మరోవైపు, విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని "ఆంధ్రప్రదేశ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ అండ్ కంట్రోల్) రూల్స్-2026" ముసాయిదాకు ఆమోదం తెలిపారు. దీని ప్రకారం అన్ని కోచింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి, కనీస మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు పాటించాలి, విద్యార్థులకు కౌన్సిలింగ్ సేవలు అందించాలి. ఇవే కాకుండా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ భవన నిర్మాణానికి అనుమతి, పలు చోట్ల భూ కేటాయింపులు వంటి ఇతర నిర్ణయాలను కూడా మంత్రిమండలి ఆమోదించింది.

## సీఎంపై వ్యాఖ్యలు: జోగి రమేశ్‌కు పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.
వివరాల్లోకి వెళితే, ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ఈ కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన భట్టిప్రోలు పోలీసులు, తాజాగా విచారణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే ఆయనకు నోటీసులు పంపారు.కాగా, జోగి రమేశ్‌పై గత నెలలో కూడా మరో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడం, జన సమూహాన్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలపై సెక్షన్ 30 యాక్ట్ కింద ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

## అన్ని రాష్ట్రాల సీఎంలతో నేడు మోదీ సమావేశం

: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ (ాపీ వీసీఱ) మార్చి 27న వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఆ సీఎంలు దూరంగా..**

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు (ూాంంవఎశ్రీఎ జుశ్రీవష్‌ఱశీఅం) జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## అమరావతికి చట్టబద్ధత కల్పించేలా ఏపీ క్యాబినెట్ తీర్మానం

- మొదటి పేజి తరువాయి

ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు.వీటితో పాటు, ఖనిజ లీజుల కేటాయింపులో వడ్డెర సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని నిర్ణయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసే ప్రతిపాదనకు, కుప్పం బాలికల పాఠశాలలో కొత్త పోస్టుల మంజూరుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## ప్రపంచంలో మోస్ట్ పాప్యులర్ నేతగా ప్రధాని మోదీ... పొంగిపోతున్న బీజేపీ నేతలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా మరోసారి నిలిచారు. అమెరికాకు చెందిన ప్రముఖ డేటా అనలిటిక్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' నిర్వహించిన సర్వేలో ఆయన 68 శాతం అప్రూవల్ రేటింగ్‌తో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. మార్చి 2 నుంచి 8వ తేదీ మధ్య ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఫలితాలను బీజేపీ నేతలు స్వాగతిస్తూ, ప్రధానిపై ప్రశంసలు కురిపించారు.ఈ విషయంపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్పందిస్తూ, "ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే ఉత్తమ నేత. ఇప్పుడు ప్రధానిగా ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా కొనసాగుతున్నారు. కేవలం సర్వేల ఆధారంగానే కాకుండా, ఆయన జీవితాంతం చేసిన సేవ వల్లే ఈ గుర్తింపు లభించింది" అని అన్నారు.యూపీ మంత్రి డానిష్ ఆజాద్ అన్సారీ మాట్లాడుతూ, "మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను అందుకుంది. ప్రపంచ పురోగతిలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని నిరూపించాం. ఆయన నాయకత్వం వల్లే ప్రపంచ దేశాలతో మన సంబంధాలు బలపడ్డాయి" అని వివరించారు. ఇదే అభిప్రాయాన్ని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ కూడా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ నాయకుడని, ఆయన పనితీరు దేశానికి గర్వకారణమని వారు కొనియాడారు. ఈ ఘనత సాధించినందుకు ప్రధాని మోదీకి దేశం తరపున అభినందనలు తెలిపారు.

## రామరాజ్య స్థాపనకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి

- మొదటి పేజి తరువాయి

ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. శ్రీరామచంద్రమూర్తి చూపిన బాటలో పయనిస్తూ, ఆయన సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.
ప్రజలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆ శ్రీరాముడి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం విషయంలో నాటో దేశాల తీరుపై ట్రంప్ ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

ఇరాన్ మిలిటరీ పరంగా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఈ దశలో కూడా అమెరికాకు నాటో దేశాల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదని వాపోయారు.వాస్తవానికి ఇప్పటి పరిస్థితుల్లో నాటో దేశాల నుంచి తమకు ఎలాంటి సహకారం అవసరం లేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ ఇలాంటి కీలకమైన సమయాల్లో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మరిచిపోబోమని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధానికి ట్రంప్ ఐదురోజుల పాటు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్‌తో చర్చల ఫలితాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని తెలిపారు.

# బాపట్ల లో ఏరువాక కేంద్ర ఆధ్వర్యం లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 26: రైతుల ఆదాయాన్ని పెంచడం పంటల నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఏరువాక కేంద్రం, బాపట్ల ఆధ్వర్యంలో గురువారం నాడు బాపట్లలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి. శివ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ముందు మరియు కోత తర్వాత సరైన రైతు యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను రైతులు వినియోగించడం ద్వారా వ్యవసాయ రంగంలో దిగుబడులలో వ్యత్యాసం తగ్గించడం, ఖర్చులు తగ్గి ఆదాయాన్ని పెంచడం, విత్తనోత్పత్తి సాధ్యమవుతాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, గుంటూరు పరిశోధన సహ సంచాలకులు డా. ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు నూతన పరిశోధనలను తెలుసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశాన్ని నిర్వహించిన ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె. అచ్యుతరాజు మాట్లాడుతూ రైతులకు పంట యాజమాన్యం పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సమావేశాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ



అధికారి ఏం విజయ నిర్మల, బాపట్ల జిల్లా ఏపి ఎం ఐ పి ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ రమణ, లీడ్ బ్యాంక్ మేనేజర్, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతు బోడవుల లక్ష్మీనారాయణ, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సంఘాల ప్రతినిధులు, రైతులు, పాల్గొని రైతు యాజమాన్య పద్ధతులు, విలువ వృద్ధి వంటి అంశాలపై అవగాహన పొందారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ఎమ్మెల్యే ఏలూరి కృషి...

## నియోజకవర్గానికి జల జీవన్ నిధులు
## తాగునీటి పనులకు రూ.38.74 కోట్లు
## 12 గ్రామాల్లో నీటి మౌలిక అభివృద్ధి పనులు
## ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే ఏలూరి



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 26: ప్రజలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన నిరంతర ప్రయత్నాలకు ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీ రాజ్ & గ్రామీణ జలవనరుల శాఖ జి.ఓ.ఎం.ఎస్ నెం.54 ద్వారా పర్చూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సదుపాయాల మెరుగుదలకు రూ.38.74 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.జల్ జీవన్ మిషన్ కింద తాగునీరు అందేలా ఈ పనులు చేపట్టనున్నారు.

12 గ్రామాలకు లబ్ధి...

ఈ నిధులతో చిన్నగంజాం, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు మండలాల్లోని రాజుబంగారుపాలెం, కటంవారిపాలెం, కొడూరివారిపాలెం, అనంతవరం, సురవరపుపల్లి, యద్దనపూడి, చింతపల్లిపాడు, ఇంకొల్లు, అన్నంబొట్లవారిపాలెం, ఇనగల్లు, తన్నీరు వారిపాలెం, పర్చూరు, గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. ఇంకొల్లు గ్రామానికి రూ.9.94 కోట్లు, పర్చూరు గ్రామానికి రూ.10.41 కోట్లు కేటాయించడం విశేషం.

ప్రభుత్వం దృష్టికి సమస్య....

గ్రామాల్లో తాగునీటి కొరత, పాత పైప్‌లైన్లు, సరిపడని నిల్వ సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, మంత్రులతో సమీక్షలు నిర్వహిస్తూ ఈ ప్రతిపాదనలకు ఆమోదం పొందేలా కృషి చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

గ్రామీణ ప్రజలకు శాశ్వత పరిష్కారం...

ఈ పనులు పూర్తయితే వేలాది కుటుంబాలకు నాణ్యమైన తాగునీరు ఇంటి వద్దే అందుబాటులోకి రావడంతో పాటు, వేసవిలో తలెత్తే నీటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించడమే మా లక్ష్యం అన్నారు. ప్రజల అవసరాలను ప్రభుత్వం ముందుంచి నిరంతరం ప్రయత్నిస్తున్నాం. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

మండలాల వారిగా...

చిన్నగంజాం మండలం
రాజుబంగారుపాలెం గ్రామానికి -- రూ.4.77 కోట్లు
కాటంవారిపాలెం గ్రామానికి -- రూ.61.65 లక్షలు
కోడూరువారిపాలెం గ్రామానికి -- రూ.58.95 లక్షలు
యద్దనపూడి మండలం
అనంతవరం గ్రామానికి -- రూ.1.01 కోట్లు
సురవరపుపల్లి గ్రామానికి -- రూ.1.10 కోట్లు
యొద్దనపూడి గ్రామానికి -- రూ.2.63 కోట్లు
చింతపల్లిపాడు గ్రామానికి -- రూ.1.39 కోట్లు
ఇంకొల్లు మండలం
ఇంకొల్లు గ్రామానికి -- రూ.9.94 కోట్లు
పర్చూరు మండలం
అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి -- రూ.3.97 కోట్లు
ఇనగల్లు గ్రామానికి -- రూ.1.46 కోట్లు
తన్నీరువారిపాలెం గ్రామానికి -- రూ.81 లక్షలు
పర్చూరు గ్రామానికి -- రూ.10.40 కోట్లు.

# బీఆర్ స్టేడియం క్రీడాకారుల కలలకు రెక్కలు ఇచ్చే దేవాలయం





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 26. క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి స్టేడియంల అభివృద్ధి ఎంతో కీలకమని, యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గుంటూరును అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి కట్టుబడి, ఖేలో ఇండియా తరఫున మంజూరైన నిధులతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన మల్టీ-స్పోర్ట్స్ సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..

బీఆర్ స్టేడియం అభివృద్ధి అనేది గుంటూరు ప్రజల చిరకాల వాంఛగా ఉండగా, నేడు శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. స్టేడియం అంటే కేవలం మైదానం మాత్రమే కాదు, క్రీడాకారుల కలలకు రెక్కలు ఇచ్చే దేవాలయమని అభివర్ణించారు.

ఈ స్టేడియం పి.టి. ఉషా వంటి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ప్రతిభకు సాక్ష్యంగా నిలిచిందని, అనేక రంజీ ట్రోఫీ మ్యాచ్‌లకు వేదికగా నిలిచిన గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు.

ఇటీవలి కాలంలో స్టేడియం నిర్లక్ష్యానికి గురై, దుస్థితిలోకి చేరిందని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

అనేకసార్లు రివ్యూ సమావేశాల్లో, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ నిధుల కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఖేలో ఇండియా పథకం కింద రూ.17 కోట్ల నిధులు మంజూరవడం గొప్ప విషయమని, దశలవారీగా స్టేడియాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ సంతోషకరమని తెలిపారు.

పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గుంటూరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, గుంటూరు ఛానల్, ఆర్‌ఓబీలు, నందివెలుగు, వెంగళాయపాలెం ట్యాంక్ వంటి అనేక ప్రాజెక్టులకు నిధులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకునే నాయకుడిగా పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

బీఆర్ స్టేడియం అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజలు కూడా భాగస్వామ్యంగా తీసుకుని సంరక్షించుకోవాలని, అందరం కలిసికట్టుగా స్టేడియం వైభవాన్ని మరింత పెంచాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, రాష్ట్ర బడ్జెట్‌లో కూడా క్రీడల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు, యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# శ్రీరాముని ఆదర్శాలు నేటి సమాజానికి దిక్సూచి విన్నకోట సురేష్

- బాపట్ల ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు
- ధర్మం, న్యాయం వెల్లివిరిసే 'రామరాజ్యం' రావాలని ఆకాంక్ష
- జనసేన కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక అభినందనలు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 26: బాపట్ల, మార్చి 26: లోక కల్యాణం కోసం, ధర్మ సంస్థాపన కోసం అవతరించిన ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుని జన్మదినమైన 'శ్రీరామనవమి' పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల నియోజకవర్గ ప్రజలకు, జనసైనికులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన నాయకులు విన్నకోట సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, శ్రీరాముని జీవితం నుండి నేర్చుకోవాల్సిన పాఠాలను, ప్రస్తుత రాజకీయ సామాజిక పరిస్థితులను ప్రస్తావించారు. శ్రీరామ చంద్రుడు చూపిన బాటలోనే మన జనసేనాని పవన్ కళ్యాణ్ ధర్మం కోసం, ప్రజల శ్రేయస్సు కోసం పోరాడుతున్నారు. రామరాజ్యం అంటేనే న్యాయం, ధర్మం, సమానత్వం వెల్లివిరిసే పాలన. అటువంటి ఆదర్శవంతమైన పాలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రావాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని విన్నకోట సురేష్ పేర్కొన్నార.

# సూర్యలంక అడవి రెవెన్యూ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు





పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 26: గురువారం సూర్యలంక అడవి రెవెన్యూ పంచాయతీ పరిధిలోని మెరైన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించారు. సర్వేనెంబర్ 547/3A7 నందుగల 4 ఎకరాల 3 సెంట్లు ప్రభుత్వ భూమిని మ్యాప్ ద్వారా మండల సర్వే అధికారులు కలెక్టర్కు వివరించారు. ఆ సర్వే నందు నిర్మితమైన శివాలయం, మెరైన్ పోలీస్ స్టేషన్, ఫిష్ ఆంధ్ర షాపులు, పంచాయతీ స్థల ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సూర్యలంక బీచ్ వద్ద గల తుఫాను రక్షణ భవనమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తనిఖీ చేశారు. తుఫాను రక్షణ భవనంలోని రెండు అంతస్తులు అందుగల ప్రతి గదిని ఆయన పరిశీలించారు. తుఫాను రక్షణ భవనం పై అంతస్తు నుండి చుట్టూ పరిసరాలను ఆయన వీక్షించారు. సర్వే నెంబర్ 547/3ూ7 నందుగల 4.03 సెంట్లు పంచాయతీ స్థలంలో గల శివాలయం, మెయిన్ పోలీస్ స్టేషన్, ఫిష్ ఆంధ్ర షాపులు మరియు ఖాళీ ప్రదేశం మొత్తం 3 ఎకరాల ప్రాంతం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని, వాటికి సంబంధించి అంచనా తయారు చేయాలని ఇన్చార్జి పంచాయతీరాజ్ డి ఈ ని కలెక్టర్ ఆదేశించారు. ఆ సర్వే నెంబర్ లో ఆక్రమణకు గురైన ప్రాంతంను ఖాళీ చేయించుటకు నోటీసులు జారీ చేయాలని ఆయన రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూమిలో శివాలయ నిర్మాణానికి సంబంధించి వివరాలపై బాపట్ల ఎంపిడిఓను ఆయన ఆరా తీశారు

ఈ కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల మండల రెవెన్యూ అధికారి సలీమా, ఇన్చార్జి పంచాయతీరాజ్ డిఇ రామారావు, బాపట్ల ఎంపీడీవో బాబురావు, బాపట్ల మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వెల్లటూరులో ఉచిత మెగా వైద్య శిబిరం --300 మందికి వైద్య పరీక్షలు




భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 26: భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గ్రామంలో గురువారం గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. వెల్లటూరు గ్రామంలోని శ్రీ కట్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో లలిత సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరం ను శ్రీ కట్లమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రారంభించారు. శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని 300 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ,బీపీ,షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పి బసవరాజు,డాక్టర్ జగన్నాథం రామాంజనేయులు, రాజా రమేష్,పారా మెడికల్ సిబ్బంది, ఫార్మసిస్ట్ సిబ్బంది, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోటూరు వాసుదేవరావు, వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ నంబూరు నాగభూషణరావు, యార్లగడ్డ రాఘవేంద్రరావు,కొల్లి శ్రీనివాసరావు, వెంకటప్పయ్య, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

# నవమి వేడుకలకు ముస్తాబైన శ్రీరామ మందిరాలు



వేమురు(భట్టిప్రోలు) పెన్ పవర్ మర్చి, 26: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని వేమూరు,భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు,మండలా లలోని రామాలయాలను నవమి వేడుకలకు సిద్ధం చేశారు. శ్రీసీతారాముల కళ్యాణం జరిపించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి రాముల వారి కళ్యాణం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని గ్రామాల్లో వేమూరు చావలి పెరవలి,పెరవలి పాలెం కుచ్చల్లపాడు,

భట్టిప్రోలు,అద్దేపల్లి పల్లె కోన వెల్లటూరు మరియు ఇతర గ్రామాల్లో కూడా వేడుకలకు ఆలయాలను సిద్ధం చేశారు.ఐదు రోజులపాటు జరిపించే వేడుకల్లో నవమి రోజున రాముల వారి కళ్యాణం జరిపించనున్నారు. వేడుకలకు సంబంధించి ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఒలంపియాడ్ పరీక్షలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

చల్లపల్లి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: ర్యాంకర్స్ ఒలెంపియడ్స్ అకాడమి హైద్రాబాద్ వారు నిర్వహించిన జాతీయస్థాయి మ్యాథ్స్ అండ్ సైన్సు స్టేజ్ 2 ఒలంపియాడ్ పరీక్షలో ఏడుగురు విద్యార్థులు బంగారు, రజిత,కాంస్య పతకాలుసాధించినట్లు ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమరావు తెలిపారు. పరీక్షలలో ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న కృష్ణా జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, పాఠశాల కరెస్పాండంట్ గొర్రెపాటి రామకృష్ణ మాట్లాడుతూ .. ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులు ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరంలోనే జాతీయస్థాయిలో బంగారు, రజత, కాంస్య వంటి ఏడు పతకాలు సాధించడం సంతోషంగా ఉందని అన్నారు.

# ప్రజా రంజక పాలనలో భావి రాజకీయ తరాలకు, పార్టీలకు అసలైన మార్గదర్శి చంద్రబాబు : ప్రత్తిపాటి

## రామరాజ్యానికి నిలువెత్తు నిర్వచనం నేటి కూటమి ప్రభుత్వ పాలన ప్రజలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, జనసేన, బీజేపీ శ్రేణులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట : రాష్ట్ర ప్రజలకు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు, మిత్ర పక్షాలైన జనసేన , బీజేపీ శ్రేణులకు శ్రీ రామ నవమి పర్వదిన శుభాకాంక్షలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గానీ, విభజనానంతర ఏపీలో గానీ రామ రాజ్యం అనే మాటకు సజీవ తార్కాణంగా నిలిచిన సుపరిపాలన అందించిన ఏకైక రాజకీయపార్టీ తెలుగుదేశం మాత్రమే. స్వర్గీయ నందమూరి తారక రాముడు చూపిన మార్గంలో ప్రజారంజక, ప్రగతి దీపిక పాలన సాగించడంలో భావి రాజకీయ తరాలకు, పార్టీలకు అన్నివేళలాఅసలైన మార్గదర్శిగా నిలుస్తున్నారు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆయన నాయకత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన కూడా రామరాజ్యమనే మాటకు నిలువెత్తు నిర్వచనంగా నిలుస్తోంది. ప్రజల సుఖసంతోషాలే కొలమానంగా, రాష్ట్ర ప్రగతే పరమావధిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు.. చేపడుతున్న చర్యలు.. ఆచరణలో పెడుతున్న ఆలోచనలు ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి సోపానాలు అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అని మాజీమంత్రి ప్రత్తిపాటి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# గ్రామ సీమల్లో తాగునీరు 20 కోట్ల రూపాయల మంజూరు

## బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 26: గ్రామ సీమల్లో తాగునీరు సంపూర్ణంగా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బాపట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సమర్ధవంతమైన తాగునీటి ప్రణాళిక సిద్ధమైంది. ఈ వేసవి నాటికి ఈ ప్రణాళిక అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కృషి ఫలితంగా సుమారు 20 కోట్ల రూపాయల పైచిలుకు ఈ పథకాలను పల్లె సీమలకు అందించబోతున్నారు. ఎక్కడా తాగునీటికి సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నీళ్ల కోసం మైళ్ళు నడిచే పరిస్థితి తలెత్తకుండా జలజీవన్ మిషన్ పథకం అందుబాటులోకి తెచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. బాపట్ల నియోజకవర్గంలోని ఎనిమిది గ్రామాల్లో తొలి విడత తాగునీటి పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నారు. బాపట్ల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో తాగునీరు పుష్కలంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తెలిపారు. ఇంటింటికి కొళాయి పథకాన్ని సత్వరం అమలు చేసేలా అవసరమైన ప్రణాళిక సిద్ధం అవుతుందని చెప్పారు. వేసవికాలంలో ఏ గ్రామం కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాపట్ల మండలంలోని ఉప్పల వారి పాలెం గ్రామంలో 45 లక్షలతో తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. అప్పికట్ల గ్రామానికి 48 లక్షల 60 వేలు, భర్తిపూడి గ్రామానికి ఆరు కోట్ల 30 లక్షల రూపాయలతో తాగునీటి పథకాలు సిద్ధమవుతున్నాయి. మొత్తంగా బాపట్ల మండలంలో ఏడు కోట్ల 23 లక్షల 60 వేల రూపాయలు మంజూరైనట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తెలిపారు. కర్లపాలెం మండలంలోని సముద్ర తీర ప్రాంత గ్రామమైన పెదపులుగు వారి పాలెం లో మూడు కోట్ల 73 లక్షల 50వేల రూపాయలతో తాగునీటి పథకం రాబోతోంది. ఇదే మండలంలోని నర్రా వారి పాలెం గ్రామంలో 3 కోట్ల 43 లక్షల 50 వేల రూపాయలతో సంపూర్ణమైన తాగునీటి పథకం సిద్ధమవుతోంది. ఈ మండలంలో తాగునీటి పథకాలకు ఏడు కోట్ల 17 లక్షల 30 వేల రూపాయలు మంజూరైనట్లు వివరించారు. పిట్టల వాని పాలెం మండలంలో చందోలు గ్రామంలో 4 కోట్ల 54 లక్షల50 వేల రూపాయలతో తాగునీటి పథకం అమలు కాబోతోంది. అలకాపురం గ్రామంలో 38 లక్షలతో తాగునీటి పథకం, సంగుపాలెం కోడూరు గ్రామంలో ఒక కోటి 1లక్ష 25వేల రూపాయల వ్యయంతో జల జీవన్ మిషన్ కింద తాగునీటి అవసరాలకు పథకాలు రూపొందిస్తున్నామని చెప్పారు. పిట్టలవానిపాలెం మండలంలో మొత్తంగా ఐదు కోట్ల 93 లక్షల 75 వేలు మంజూరయ్యాయి. బాపట్ల నియోజకవర్గ మొత్తం మీద 20 కోట్ల 34 లక్షల 65 వేల రూపాయలు మంజూరైనట్లు వివరించారు. బాపట్ల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈ గ్రామాల్లో తాగునీటి కోసం తాను చేసిన సిఫార్సుకు స్పందించి సహకరించిన ప్రభుత్వానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాణాలు పోతున్నా చర్యలు లేవా?

## మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఎంఆర్‌పీఎస్ ఆగ్రహం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట : మార్కాపురం సమీపంలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంపై ఎంఆర్‌పీఎస్ నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మార్గదర్శకత్వంలో పల్నాడు జిల్లా టౌన్ కార్యాలయంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ మాట్లాడుతూ.. జగిత్యాల నుండి కనిగిరి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై 13 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కేవలం సానుభూతి ప్రకటనలతో సరిపెట్టకుండా, మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 10 లక్షల పరిహారం వెంటనే అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు వారి పిల్లలకు ఉచిత విద్య, నివాస గృహాలు, మరియు సాగుభూమి కల్పించాలని కోట సుబ్బు మాదిగ విన్నవించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై ఉక్కుపాదం మోపాలని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల జార్జ్, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పలుకూరి రామారావు మాదిగతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.


# మార్కాపురం దుర్ఘటన అత్యంత విషాదకరం : ప్రత్తిపాటి

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దహనం ఘటనలో 14 మంది మృత్యువాత పడటం తీవ్రంగా కలచివేసింది.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట : మార్కాపురం జిల్లా రాయవరం సమీపాన జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దహనం దుర్ఘటన అత్యంత విషాదకరం. ఈ ఘటనలో 14 మంది సజీవ దహనమయ్యారన్న వార్త తీవ్రంగా ఆవేదనకు గురయ్యాను. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియ చేస్తున్నాను. దుర్ఘటనపై ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టడంతో ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించడం సాధ్యమైంది. దుర్ఘటనలో గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు మెరుగైన వైద్య సేవలతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయి. ప్రభుత్వాలు అందించే చేయూతతో తమవారిని కోల్పోయిన వారి హృదయవేదన ఎప్పటికీ తీరదనేది వాస్తవం. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు (ఒక్కో కుటుంబానికి) రూ. 5 లక్షలు గాయపడిన వారికి రూ. 2 లక్షల పరిహారం ప్రకటించి కొంత మేర అండగా నిలిచింది. అలానే కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల పరిహారం ప్రకటించింది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

# బస్సు దహనం దుర్ఘటనకు బాధ్యులు ఎవరు? సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట: మార్కాపురం ప్రాంతంలో జరిగిన హరికృష్ణ ట్రావెల్స్ బస్సు మరియు కంకర లోడ్ తో వస్తున్న టిప్పర్ మూల మలుపు వద్ద ఢీ కొట్టిన దుర్ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమై 13 మంది గా పైగా మరణించగా, 25 మంది పైగా క్షతగాత్రులైనారు అని ఈ సంఘటనలో బాధ్యులెవరు అని ప్రభుత్వాన్ని నిలదీశారు. 12 సంవత్సరాల క్రితం, పాలెం బస్సు దహనం దుర్ఘటనలో 45 మంది యువ సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ మృతి చెందిన సంఘటన దగ్గర నుండి ఈ ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నా అధికారులు కంటి తుడుపు చర్యలు తీసుకుంటున్నారు అని పరమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం చాలా విచారకరమని అన్నారు. ఈరోజు మార్కాపురం ప్రాంతంలో జరిగిన బస్సు యాక్సిడెంట్ కు మూలో మలుపు డిజైన్లు లోపం ఉన్నట్లుగా అక్కడి ప్రజాప్రతినిధులే చెప్పడం విచారకరం అని ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భాను ప్రసాద్ కోరారు.

# చిలకలూరిపేటలో పెట్రోల్ బంకుల తనిఖీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట : పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత ఉందనే ప్రచారం నేపథ్యంలో, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ మరియు సివిల్ సప్లైస్ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి బంకుల్లోని నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా, బాటిళ్లు లేదా క్యాన్లలో పెట్రోల్ పోయడం పూర్తిగా నిషిద్ధమని, కేవలం వాహనాలకు మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేశారు. ఆసుపత్రులు, ఫైర్ స్టేషన్ మరియు పోలీసుల వంటి అత్యవసర సేవలకు మాత్రమే అనుమతి పత్రాల ఆధారంగా సరఫరా చేయాలని ఆదేశించారు. ఇంధనాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించినా లేదా అక్రమంగా నిల్వ చేసినా నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బంక్ యజమానులను అధికారులు హెచ్చరించారు.

# సాయి మందిరంలో అన్నప్రసాద పంపిణీ ...అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు






పెన్ పవర్ కారంపూడి మార్చి 26:--- కారంపూడి లోని శిరిడి సాయి మందిరంలో గురువారం ఉదయం కాకడ హారతి పంచామృత అభిషేకాలు మధ్యాహ్న హారతి అనంతరం అన్నదాన కార్యక్రమం వైభవంగా 200 మందికి అన్న ప్రసాద పంపిణీ జరిగింది ఈ కార్యక్రమానికి దాతలు జనక నీళ్ల గోత్రం పాతూరి శివరామకృష్ణారెడ్డి ధర్మపత్ని రాఖి తల్లి కమల తండ్రి కేశవరెడ్డి (రా) ఆధ్వర్యంలో జరిగింది మరియొక దాత (నాగిరెడ్డి ఆదిలక్ష్మి ) ఈ కార్యక్రమంలో సేవలు నిర్వహించినవారు మాడిశెట్టి పుష్పలత బేతవోలు నాగమణి శ్రీజశ్విత లక్ష్మీ మహేశ్వరి పల్లా పద్మ మరియు అన్నపూర్ణ,వెలుగూరి అరుణ గ్రంధి స్రవంతి తదితరులు పాల్గొని సేవలందించారని అధ్యక్షురాలు గుండా నాగమల్లేశ్వరి మందిరం అధ్యక్షులు శంకర్రావు తెలిపారు ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గురువారం కార్యక్రమాలను విజయవంతం చేసి అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్నారని అర్చకులు దిలీప్ కుమార్ఆచార్యులు తెలిపారు

# అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : టిడిపి యువనేత

ఆలమూరు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం యువనాయకులు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. మండలంలోని చొప్పెల్లలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన గురువారం కూటమి నేతలతో కలసి పాల్గొన్నారు. అనంతరం రైతన్నా మీకోసం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ లో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.

# ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధతలో ప్రభుత్వ తొలి అడుగు : ప్రత్తిపాటి

## రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ కేంద్రం జారీ చేసే గెజిట్ నోటిఫికేషన్ కోసం ఉత్సుకతతో ఎదురు చూస్తున్నాం : ప్రత్తిపాటి



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట : గత పాలకుల విధ్వంసంతో ప్రాభవాన్ని కోల్పోయిన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు.. రాష్ట్ర శాశ్వత రాజధానిగా మార్చే క్రతువులో ప్రభుత్వం నేడు తొలి అడుగు వేయడం ప్రజలకు గర్వకారణం. ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానాన్ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం శుభపరిణామం. కూటమి ప్రభుత్వ ప్రజా భీష్టానికి అనుగుణంగా తీసుకున్న నిర్ణయంపై యావత్ తెలుగుజాతి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. అమరావతి చట్టబద్ధతపై కేంద్రప్రభుత్వం కూడా శీఘ్రంగా స్పందించి తన బాధ్యతను సకాలంలో పూర్తిచేయాలని, 5 కోట్ల ప్రజల ఆకాంక్షలను, ఆశలను సాకారం చేయాలని వారి తరుపున విజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే రోజు కోసం ఎంతో ఉత్సుకతగా ఎదురు చూస్తున్నాం. అని మాజీమంత్రి ప్రత్తిపాటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో కాలేజీలో ప్రవేశాల కు నోటిఫికేషన్ విడుదల

గుంటూరు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ గుంటూరు ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ నోటిఫికేషన్ విడుదలైంది. గుంటూరు జిల్లాలోని నందివెలుగు రోడ్డులో గల సుభాష్ నగర్ కాలనీలోని గల ఉర్దూ బాలుర గురుకుల పాఠశాల, సంగడిగుంట లో గల బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఆరు, ఏడు ,ఎనిమిది తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఎం రజిని తెలిపారు. అలాగే ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఉర్దూ బాలుర లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నందు ఎంపీసీ, బైపిసి మరియు సీఈ సెలలో అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించటమైనది అని జిల్లా కన్వీనర్ తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 7 కాగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముస్లింలు క్రిస్టియన్లు సిక్కులు జైనులు మరియు బౌద్ధ మైనారిటీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడమైనది. పూర్తి వివరాల కొరకు పాఠశాల



పని దినాలలో ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. 8712625038, 8712625039,8712625073.

# గణపవరంలో పోలీసుల కార్డన్ సెర్చ్

## మారణాయుధాలు, 70 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : నాదెండ్ల : గణపవరం గ్రామంలో పోలీసులు తెల్లవారుజామున భారీ స్థాయిలో 'కార్డన్ సెర్చ్' తనిఖీలు నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు. అడిషనల్ ఎస్పీ నిరంజన్, డీఎస్పీ హనుమంతురావు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్లో 30 మంది ఉన్నతాధికారులు, దాదాపు 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి వీధిని, అనుమానిత ఇళ్లను జల్లెడ పట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలతో పాటు భారీగా మారణాయుధాలను పోలీసులు స్వాధీనం



చేసుకున్నారు. 70 ద్విచక్ర వాహనాలు,23 గొడ్డళ్లు, 11 గడ్డపారలు,ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వ్యసనాలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో గానీ, డీఎస్పీకి గానీ సమాచారం అందించాలని కోరారు.

# సెక్రటేరియట్ అధికారులకు ఐకానిక్ టవర్లు

అమరావతి: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్ కు ఐకానిక్ టవర్లను డిజైన్ చేశామని మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి రాజధానిలో నిర్మిస్తున్న ప్రధాన శాఖల టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులకి మంత్రి పి నారాయణ బుధవారం పూజ నిర్వహించి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఐదు టవర్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మాణం జరుగుతుందన్నారు. గత ఏడాది వర్షాలు ఎక్కువగా రావడంతో 4 నెలల పాటు పనులకు ఆటంకం కలిగిందన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు,అధికారుల నివాసాలు, మౌళిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయనీ తెలిపారు. అమరావతి నిర్మాణానికి సీఎం ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ఇచ్చారన్నారు. ప్రజలు కట్టే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా అమరావతికి ఖర్చు పెట్టడం లేదన్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని తెలిపారు. అమరావతిలో అదనంగా ఖర్చు పెడుతున్నట్లు కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారనీ తెలిపారు. అమరావతిలో జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు



రివ్యూ చేసారని ప్రస్తుతం ప్రమాదం పై విచారణ జరుగుతుందన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# చిలకలూరిపేటలో భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల పాదయాత్ర

## బాలయేసు పుణ్యక్షేత్రానికి కదిలిన వేలాదిమంది భక్తులు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 26 : చిలకలూరిపేట: ప్రస్తుతం క్రైస్తవ లోకం అనుసరిస్తున్న 40 రోజుల లెంట్ శ్రమలదినాలను పురస్కరించుకొని, పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తమ పాప పరిహారార్థం పుణ్యక్షేత్రాలను సందర్శించడం రోమన్ క్యాథలిక్ క్రైస్తవుల ఆచారం కావడంతో, గురువారం పట్టణంలోని చార్లెస్ కాన్వెంట్ వద్ద ఉన్న ఆర్సీయం చర్చి నుండి భారీ పాదయాత్ర నిర్వహించారు. నాదెండ్ల మండలం కనపర్రులోని బాలయేసు పుణ్యక్షేత్రం లక్ష్యంగా సాగిన ఈ పాదయాత్రలో సుమారు రెండు



వేలమంది భక్తులు పాల్గొన్నట్లు చర్చి ఫాదర్ పి. థామస్ వెల్లడించారు. భక్తిగీతాలు ఆలపిస్తూ, ప్రార్థనలు చేస్తూ భక్తులు ఈ పాదయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు చుక్క విన్సెంట్ పాల్తో పాటు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

# క్లస్టర్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

## ఔట్ రీచ్ ప్రోగ్రామ్ ద్వారా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

## రైతులకు గరిష్ట ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు.






పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: జిల్లాలోని 28 మండలాల్లో వినూత్నంగా 28 క్లస్టర్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా వివిధ రకాల ప్రాసెసింగ్ ప్లాంట్లను గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని గుర్రం జాషువా మీటింగ్ హాల్లో డి.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు... ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించే పంటలకు అదనపు విలువ చేకూర్చడం ద్వారానే వారికి మెరుగైన ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి మండలంలో గుర్తించిన క్లస్టర్లకు సంబంధించిన డీపీఆర్లు వెంటనే బ్యాంకులకు సమర్పించాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల వివరాలు, సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలను త్వరితగతిన క్రోడీకరించాలన్నారు. పి.ఎం.ఈ.జి.పి, పీ.ఎం.ఎఫ్.ఎం.ఈ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పించి, యూనిట్లను క్షేత్రస్థాయిలో ప్రారంభించాలన్నారు. పల్నాడు జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చేలా ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించి, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు.డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే పండ్లు, కూరగాయలు, మ్యానిఫ్యాక్చరింగ్, పశు సంపద మరియు ప్రసిద్ధ దుర్గి స్టోన్ క్రాఫ్ట్ వంటి వివిధ విభాగాల్లో క్లస్టర్లను గుర్తించినట్లు తెలిపారు. వీటన్నింటికీ త్వరలోనే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు... ఈ సమావేశంలో ఎస్.బి.ఐ, ఏ.పీ.జీ.బీ, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్లు పాల్గొని, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డాక్యుమెంట్లు మరియు బ్యాంకు నిబంధనలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఓ నాగేశ్వర్ నాయక్, ఉద్యానవన శాఖ పి.డి వెంకట్రావు, వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు, ప్రకృతి వ్యవసాయ అధికారి అమల కుమారి, ఎల్.డి.ఎం రాంప్రసాద్, మరియు అన్ని మండలాల ఎం.పి.డి.ఓలు, ఏ.పీ.ఎంలు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

# ఏప్రిల్ చివరి వరకు సాగునీరు విడుదల చేయాలి: ఏపి రైతు సంఘం

పల్నాడు జిల్లా : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: పల్నాడు జిల్లాలో రబీ పంటలను కాపాడేందుకు ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరు నిరంతరాయంగా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నరసరావుపేట లోని సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కొడాలి ఏడుకొండలకు వినతిపత్రం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ.. జిల్లాలో లక్షలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న తదితర పంటలను ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి సాగు చేశారని తెలిపారు. పంట చేతికి వచ్చే కీలక దశలో సాగునీరు అందించకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం, రైతులు అప్పులపాలవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే



పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల పరిస్థితి "మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా" మారుతుందని విమర్శించారు. వ్యవసాయం నష్టాల బాటలో ఉన్న వేళ, సాగునీటి విధానంలో పాలకుల అవగాహన రాహిత్యం రైతులను మరింత కష్టాల్లోకి నెట్టేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ పేరుతో గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సాగు నీరు ఇవ్వడంలో విఫలమవుతుందని ఆరోపించారు.కాలువల ఆధునీకరణ లోపం, సిబ్బంది కొరత కారణంగా సాగునీరు వృథా అవుతుందన్నారు. సరైన నిర్వహణతో చివరి భూములకు నీరు అందించవచ్చన్నారు. ప్రభుత్వం స్పందించి కాలువల ఆధునీకీకరణ, సిబ్బంది నియామకం ద్వారా నీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు. ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# పరిశుద్ధ దేవాలయం శంకుస్థాపన కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి





నరసరావుపేట : నమస్తే పల్నాడు, మార్చి నరసరావుపేట రూరల్ మండలంలోని జొన్నలగడ్డ లో గురువారం ఏర్పాటు చేసుకున్న దళిత కాలనీలో పరిశుద్ధ దేవాలయం, శంకుస్థాపన కార్యక్రమం లో పల్నాడు జిల్లా వైయస్సార్ సిపి వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.. ముందుగా పరిశుద్ధ దేవాలయానికి విచ్చేసిన క్రైస్తవ మత పెద్దలతో స్థానిక సంఘ పెద్దలు ప్యారిస్ పాస్టర్ ప్రార్థన తో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.. మాజీ శాసనసభ్యులు వెంట కులమతాలకతీతంగా పెద్ద సంఖ్య లో గ్రామస్తులు వైఎస్ఆర్ సిపి సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి,మూరె రవీంద్రారెడ్డి,యజ్ఞ రెడ్డి, గ్రామ సర్పంచ్ కుందా చిన్నా ,అన్నవరపు కిషోర్,చంటి,మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు క్రైస్తవ మహిళలు తదితరులు పాల్గొన్నారు...

# పొట్టి శ్రీరాములు విగ్రహం నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి: సిపిఐ



తుళ్లూరు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 26: రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం నిర్మాణ భాధ్యతను ప్రభుత్వం చేపట్టాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ కె నారాయణ అన్నారు. రాజధానిలోని తుళ్లూరు- పెదపరిమి మధ్య నెక్కల్లు రోడ్డులో నిర్మించిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నారాయణ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం పోరాడి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు దీక్ష చేసిన వ్యక్తి అని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విగ్రహ నిర్వహణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పొట్టి శ్రీరాములు మోమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ దూండి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# 1 కోటి 51 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు సిసి డ్రైన్ ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే

నేను శ్రీధరన్న శిష్యుడినే.
శ్రీధరన్న స్పీడ్ ను మేము అందుకోలేము.
నెల్లూరు రూరల్ ప్రజలు ఒకరికి ఓటువేస్తే
మీ కోసం ఇద్దరు పనిచేస్తున్నారు.కావలి ఎమ్మెల్యే
దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి.





నెల్లూరు పెన్ పవర్ మార్చి 26. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లిలో 1 కోటి 51 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు, సీసీ డ్రైన్ లను ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. నాకంటూ ఇబ్బంది వస్తే నేను అడిగేది ఒకరినే అది శ్రీధరన్ననే. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి ప్రజల్లో ఉండడం వాళ్ళకి ఇష్టం. నెల్లూరు రూరల్ ప్రజలకు ఇలాంటి నాయకులు దొరకడం వారి అదృష్టం. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి. నెల్లూరు రూరల్ లో మంచి నాయకత్వం ఉంది. నెల్లూరు రూరల్ లో ఎప్పుడూ ఏ కార్యక్రమానికి పిలిచినా రావడానికి నేను సిద్ధంగా ఉంటా. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చినతరువాత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో 2 సంవత్సరాలు పూర్తికాకముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న మరియు టెండర్లు పిలిచి ప్రారంభం కావలసిన అభివృద్ధి పనుల విలువ 614 కోట్ల రూపాయలు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.ఎన్నో సంవత్సరాలనుంచి కాని అభివృద్ధి పనులు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పై కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి జెన్ని రమణయ్య, స్థానిక కార్పొరేటర్ ఆరవ శాంతి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్.సి. సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్చార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, రాష్ట్ర టీడీపీ ఎస్.సి. సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, కార్పొరేటర్లు భీమినేని మురహరి, బద్దెపూడి నరసింహగిరి, క్లస్టర్ ఇంచార్జ్ లు మన్నెం పెంచల నాయుడు, కంటే సాయి బాబా, సాబీర్ ఖాన్, కో క్లస్టర్ ఇంచార్జ్ లు రాఘవేంద్ర, కోటి రెడ్డి, ఎల్.పి. కృష్ణా రెడ్డి, 24వ డివిజన్ అధ్యక్షులు గుండాల రవి, 25వ డివిజన్ అధ్యక్షులు శేష యాదవ్, బిజెపి నాయకులు ఎరబోలు రాజేష్, మొగరాల సురేష్, జనసేన నాయకులు గునుకుల కిషోర్, ఉదయ్ కుమార్, తెలుగుదేశం , బీజేపీ, జనసేన పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలను సత్వరమే పరిష్కరించాలి...

## రైతన్నల కోసమే కూటమి ప్రభుత్వం..
## రైతన్నలకు అన్ని విధాల అండగా ఉంటాం... నెలవల. విజయశ్రీ...





పెళ్లకూరు,పెన్ పవర్, మార్చి 26 పెళ్లకూరు మండలంలోని పాలచూరు గ్రామం నందు గురువారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూళ్లూరుపేట శాసనసభ్యులు నెలవల. విజయశ్రీ మాట్లాడుచూ రైతుల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి పొందిన రైతులతో ముఖాముఖి వారి సాధక బాధకాలపై ముచ్చటించడం జరిగినది . రైతులకు యూరియా సరఫరా విషయంలో వైసిపి పార్టీ వాళ్లు చేసిన అసత్య ప్రసారాలను తుంగలో తొక్కి ఎప్పుడు లేని విధంగా అధిక దిగుబడులు సాధించి రైతులు ఎక్కువ లాభాలు పొందారని,కూటమి ప్రభుత్వం రైతుల విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. రైతులు కూడా వ్యవసాయంలో అధునాతన పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధించారని, అంతేకాకుండా రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండల తెదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య, వేలూరు మురళి కృష్ణారెడ్డి, కందమూడి శివకుమార్, చైతన్య కృష్ణారెడ్డి, తహసిల్దార్ సిహెచ్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, వ్యవసాయ అధికారిణి విజయభారతి, అనిల్ రెడ్డి, మాధవరెడ్డి, యం.చంద్ర పెంచలయ్య, కోట రమేష్, పెళ్లకూరు. భాస్కర్ మండలంలో అన్ని గ్రామాల టిడిపి నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా ప్రజలకు పోలీస్ సిబ్బందికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల, ఐ.పి.ఎస్



నెల్లూరు రూరల్ పెన్ పవర్, మార్చి, 26: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జిల్లా ప్రజలకు పోలీస్ సిబ్బంది కి జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల, ఐ.పి.ఎస్ గురువారం ఒక ప్రకటనలో శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు శ్రీరాముడు ధర్మానికి న్యాయానికి ప్రతీక అని ఈ పండుగ మనకు ధర్మాన్ని ఎలా ఆచరించాలో సందేశం ఇస్తుందని పేర్కొన్నారు ప్రశాంత వాతావరణంలో చలువ పందిళ్ల మధ్య శ్రీరామనవమి వేడుకలను ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రధాన రామాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

# బస్సు ప్రమాదంలో బుచ్చి వాసి మృతి..



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 26. కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తుండగా ఘటన.. మార్కాపురం దగ్గర అగ్నిప్రమాదంలో గురైన బస్సులో బుచ్చి పట్టణం పెద్దూరులోని ఇప్పగుంట వారి డొంక కాలనీలో చెందిన కత్తి జయరాములు (55) మృతి చెందారు. అయినా పని నిమిత్తం నిజామాబాద్ లోని ఓ గ్రామానికి కూలి పనికి వెళ్లినట్లు సమాచారం. ఆయన భార్య బుజ్జమ్మ జనవరిలో అనారోగ్యంతో మృతి చెందింది. వారి సంతానం లేరు.బుచ్చి పట్టణంలో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకి తిరిగి స్వ గ్రామానికి వచ్చే సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక సీఐ మాతంగి శ్రీనివాసరావు ఎస్ఐ సంతోష్ రెడ్డి ప్రజల వద్ద మృతిని వివరాలను సేకరించారు.

# కోవూరు నియోజకవర్గం ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు రూరల్ (కోవూరు) పెన్ పవర్, మార్చి, 26: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం లో ఉన్న ప్రజలందరికీ శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని స్మరించుకుంటూ జరుపుకునే శ్రీరామనవమి పండుగ సందర్భంగా కోవూరు నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.ధర్మం, న్యాయం, అంకితభావంతో పనిచేసే నాయకత్వం... ఇవన్నీ శ్రీరాముని జీవితం మనకు నేర్పిన గొప్ప సందేశాలు.ప్రతి ఒక్కరి జీవితంలో ధర్మం నిలవాలి. ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి – ఇదే మన సంకల్పం కావాలి. శ్రీరాముని ఆదర్శాలు మనకు మార్గదర్శకం కావాలి సీతా సమేత కోదండరాముడి కరుణా కటాక్షాలు మీ అందరిపై ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ, శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట బందోబస్తు
## నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు రూరల్ పెన్ పవర్, మార్చి, 26: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు గురువారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, సంజయ్, బాల సుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఎలక్షన్ డీటీలు ఆషర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి విద్యార్థును లకు విందు ఏర్పాటు







కావలి పెన్ పవర్, మార్చి, 26: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలి నగరంలోని ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త వేలూరు జయచంద్ర నాయుడు పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు ఈ రోజు కావలి పట్టణం నివాసులు ప్రముఖ వ్యాపారవేత్త, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, సంయుక్త సేవా సంస్థ సభ్యులు వేలూరు జయచంద్ర నాయుడు తన పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ యొక్క సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్నదానం, స్వీట్స్ , పండ్లు, చాక్లెట్స్ పంపించిన దాత వేలూరు జయచంద్ర నాయుడుకి ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు.పుట్టిన రోజు నాడు ఆడంబరాలకు పోయి వృథా ఖర్చులు చేయకుండా ఇలా పేద విద్యార్థులకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు.సంయుక్త సేవా సంస్థ ద్వారా అనేక సందర్భాల్లో పేదలకు సేవలందిస్తూ ఉన్నారని,మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. పేదలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు, ఉపాధి శిక్షణా తరగతులను తమ యొక్క సంస్థ ద్వారా నిర్వహించి పేదలకు భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నామని,ఇలాంటి పుట్టినరోజు లు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు..

# చందనోత్సవ ఏర్పాట్లు సిద్ధం..

**విశాఖపట్టణం, మార్చి 26, పెన్ పవర్:** సింహాచలం లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఏప్రిల్ 20న జరగనుంది.. ఆలయంలో ఏర్పాట్లపై ముందుగానే ప్రభుత్వం దృష్టిపెట్టింది. విశాఖపట్నం జిల్లా ఇంఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చందనోత్సవం ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్ష చేశారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు మంత్రి స్వామి. చందనోత్సవంలో సాధారణ భక్తులకు పెద్దపీట వేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనులు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 17నాటికి చందనోత్సవం టికెట్ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని.. వాహన పాసులు, డ్యూటీ పాసుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చందనోత్సవానికి సంబంధించి దర్శనాల టికెట్ల విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడాలని ఎమ్మెల్యేలు కోరారు. గతేడాది చందనోత్సవానికి సంబంధించి రాత్రి 11 గంటల వరకు భక్తులకు టికెట్లు ఇవ్వలేదన్నారు. ఈసారి మూడు రోజులు ముందుగా జారీ చేయాలని.. టికెట్ల లెక్క పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్, ఈవోల చేతుల మీదుగా టికెట్లు జారీ చేస్తే బావుంటుందని సూచించారు. అలాగే టికెట్లపై క్యూఆర్ కోడ్, స్లాట్ వివరాలు ఉండేలా చూడాలని కోరారు. చందనోత్సవం రోజు దర్శనాల కోసం వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు కలెక్టర్ హరేంధిరప్రసాద్. రూ.300, రూ.1000, రూ.1500 దర్శన టికెట్లు ఉన్న భక్తులకు విడివిడిగా క్యూ లైన్లు ఉంటాయన్నారు. వీరిలో రూ.1500 టికెట్ ఉన్న భక్తులు మాత్రం భోగమండపం

నుంచి స్వామిని దర్శించుకోవచ్చన్నారు. చందనోత్సవం రోజు అప్పన్నకు ముందుగా సుప్రభాత సేవ నిర్వహిస్తారని.. అనంతరం వ్యవస్థాపక ధర్మకర్తలకు తొలి దర్శనం ఉంటుందన్నారు.ఏపీ ప్రభుత్వం, టీటీడీ తరఫున అప్పన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని.. వేకువజామున 4.30 గంటల నుంచి వీఐపీ దర్శనాలకు అనుమతిస్తామన్నారు. అంతరాలయ దర్శనాలు కూడా ఉండవని వివరించారు. చందనోత్సవం కోసం వచ్చే భక్తుల కోసం కొండ


దిగువన 50 ఆర్టీసీ బస్సుల్ని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. చందనోత్సవం కోసం అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చీ వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు ట్యాగ్‌లు అమలు చేస్తామన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇక పదవులే.. పదవులు

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** రాజకీయం చేయాలంటే అవకాశాలు దక్కాలి. అవకాశాలు దక్కాలంటే రాజకీయం చేయాలి. అయితే ఉన్న పదవుల తక్కువ.. నేతలు ఎక్కువ అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఆంధ్రప్రదేశ్లో నియోజకవర్గాల పునర్విభజనతో కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లు మాత్రమే కాదు వందలాది పదవులు పుట్టుకొస్తాయి. వందలాదిమంది కొత్త ముఖాలు రాజకీయాల వైపు వస్తాయి. ఆర్థికంగా ఉన్నవారు.. పారిశ్రామికవేత్తలు ఇలా అందరూ రాజకీయాల వైపు రావడం ఖాయం. ఎందుకంటే గత 20 ఏళ్లుగా అదే జరుగుతోంది. ఇప్పుడు ఈ పదవుల పెంపుతో సైతం అదే జరగనుంది.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. పునర్విభజనతో మరో 80 సీట్లు పెరుగుతాయి. పార్లమెంట్ స్థానాలు 25 ఉన్నాయి. మరో 13 వరకు పెరగనున్నాయి. అయితే ఇప్పటివరకు ఎమ్మెల్సీలు ఏపీ నుంచి 52 మంది దాకా ఉండేవారు. వాటి సంఖ్య మరో 25 పెరగనున్నాయన్నమాట. రాజ్యసభ సీట్లు 11 ఉండేవి. అవి ఐదు నుంచి 6 వరకు పెరుగుతాయి. అయితే కేవలం నియోజకవర్గాల పునర్విభజన మాత్రమే కాదు. మున్సిపాలిటీలతో పాటు మండలాలు, పంచాయితీలు కూడా పెరుగుతాయి. అంటే టోటల్ గా వందలాది పదవులు లభించనున్నాయి కొత్తవారికి. అయితే ఇది కొత్తగా ఆశావహులకు చక్కటి అవకాశం కూడా.గత రెండు దశాబ్దాలుగా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. అప్పట్లో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా చాలామంది నేతలు పార్టీల్లో చేరేవారు. పార్టీల్లో సేవలు అందించేవారు. వారి సేవలను గుర్తించి పదవులు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఆర్థికంగా బలమైన వారికి అవకాశాలు దక్కుతున్నాయి. పార్టీ కోసం పని చేసే వారికి చాలా తక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. రాజకీయం డబ్బుమయంగా మారడంతో నిజమైన రాజకీయాలు చేసే వారు కూడా పక్కకు తప్పుకుంటున్నారు. కేవలం డబ్బుతో రాజకీయం చేసిన వారు కూడా ఉన్నారు. అయితే ఇప్పుడు ఏపీలో పదవులు పెరగడంతో కొత్తవారికి అవకాశం కలుగుతుంది. చాలామంది నేతలు ఇప్పటినుంచే తమను తాము ప్రమోట్ చేసుకుంటున్నారు. నియోజకవర్గస్థాయి నేతలుగా మారుతున్నారు. పునర్విభజనతో పెరగనున్న పదవులతో కొత్తవారికి చాలా అవకాశాలు పుష్కలం.. అయితే అందులో సద్వినియోగం చేసుకునేది కొందరే. ఎందుకంటే అందరికీ అవకాశాలు రావు కూడా. అయితే అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మాత్రం రాజకీయాల్లో రాణించడం చాలా సులువు. అయితే ఇప్పటివరకు రాజకీయాల్లో రాణించిన వారు ఒక ఎత్తు అయితే.. పునర్విభజనతో మరికొంతమంది తెరపైకి వచ్చే ఛాన్స్ మాత్రం కనిపిస్తోంది.

## మూడు నెలలు మాడు పగిలే ఎండలు



**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సమ్మర్ సుర్రు మంటోంది. తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. స్టార్టింగ్ లోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే.. ముందు ముందు మరెలా ఉంటుందో అనే భయం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందిఈ క్రమంలో ఏపీలో ఎండలకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేసింది ప్రభుత్వం. రానున్న మూడు నెలలు రాష్ట్రంలో తీవ్ర ఎండలు, వడగాల్పుల హెచ్చరిక జారీ చేసింది. ఈ హాట్ సమ్మర్ లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 40-42డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, జలవనరుల శాఖలకు సమన్వయ ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెలు నింపాలని ఆదేశించారు.కూలీలు ఉదయం 11లోపు పనులు ముగించాలని సూచించారు. పని స్థలాల్లో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ తప్పనిసరి చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, సౌకర్యాలు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కోకు ఆదేశాలు ఇచ్చారు. హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026 అమలు చేయాలన్నారు. స్టేట్, జిల్లా, డివిజన్ స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. ఎండల తీవ్రతపై ముందస్తు అలర్ట్ లు ఇవ్వాలని ఆర్టీజీఎస్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఎండల తీవ్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రావొద్దని సూచించారు. వడదెబ్బ ప్రమాదంపై వైద్యులు హెచ్చరికలు జారీ చేశారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి ప్రాణాపాయం కలగొచ్చన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గరిష్టంగా 42.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి నుంచి మే మధ్య వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందని అంచనా వేశారు

## వారిపై వేటు తప్పదు...

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఈసారి కూడా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లను ఖరారు చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు 263కు పెరుగుతుండటంతో కనీసం రెండు వందల స్థానాలకు కాస్త అటు ఇటుగా టీడీపీ పోటీ చేసే అవకాశముంది. అయితే ప్రస్తుతమున్న అనుభవంతో ఈసారి మాత్రం పార్టీ విధేయులకు పట్టం కట్టాలని యోచిస్తున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో యువకులు, సామాజికవర్గంతో పాటు, వారి ఆర్థిక స్థితిని చూసి టిక్కెట్లను కేటాయించారు. అయితే అది చాలా వికటించింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచి గాడి తప్పుతున్నారు.తాము వేసిన అంచనాలకు వారి పనితీరుకు మధ్య పొంతన లేకుండా పోయింది. సీనియర్ నేతలను పక్కన పెట్టి కొంత తప్పు చేశామని ఇప్పుడు పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడింది. కొత్తగా వచ్చిన నేతలకు పార్టీ పట్ల కమిట్ మెంట్ లేకపోవడంతో పాటు క్యాడర్ ను దగ్గరకు తీసుకోకపోవడంతో పాటు తమ వ్యాపారాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు స్పష్టంగా తమకు అందుతున్న వివిధ సంస్థలు, నిఘా నివేదికల ద్వారా అందుతున్నాయి.ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అయినా చాలా మందిలో మార్పు రావడం లేదు.తాము మొదటి సారి గెలిచి మోనార్క్ లమని భావిస్తూ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేరవేయడం లేదన్నది నిర్ధారణ అయింది. అందుకే ఈ సారి ట్రాక్ రికార్డు చూసిన తర్వాత మాత్రమే టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్ లు దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. నియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఏర్పడటంతో ఈసారి అభ్యర్థుల ఎంపికలో దిద్దుబాటు చర్యలతో పాటు సీనియర్ నేతలకుకూడా అవకాశాలు కల్పించడంపై నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. మరి ఎన్నికల నాటికి అందే నివేదికలను బట్టి నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

# జనసేపు వైపు నేతల చూపు

**కాకినాడ, మార్చి 26, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పెంపుతో ఏపీ పొలిటికల్స్‌లో సరికొత్త డిస్కషన్ స్టార్ట్ అయింది. ఏపీలో 175గా ఉన్న అసెంబ్లీ స్థానాలు 269కి, 25 లోక్‌సభ సీట్లు 38కి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. సీట్ల పెరుగుదల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఎక్కువ ప్లస్ పాయింట్ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 175 సీట్లలో 164 సాధించిన కూటమి, 269 సీట్లలో 135 మ్యాజిక్ ఫిగర్‌ను ఈజీగా చేరుకోవచ్చని అంచనాలు ఉన్నాయి. అధికారంలో ఉన్న కూటమి పునర్విభజనను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అయితే ఆల్రెడీ 175 నియోజకవర్గాల్లోనే బలమైన అభ్యర్థులు లేక ఇబ్బంది పడుతున్న వైసీపీకి..పెరిగే సీట్లలో క్యాండిడేట్స్‌ను నిలబెట్టడం, గెలుపు గుర్రాలను ఎంపిక చేయడం పెద్ద సవాల్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు ఫ్యాన్ పార్టీకి ఇబ్బందికర సిచ్యువేషన్స్‌ను క్రియేట్ చేయొచ్చన్న చర్చ జరుగుతోంది.టీడీపీలో టికెట్ ఆశావహులు ఎక్కువగానే ఉంటారు. గత ఎన్నికల్లోనే తమకు సీటు ఇవ్వలేదని అలిగిన నేతలు..సీటు త్యాగం చేసి పదవులు దక్కట్లేదన్న అసంతృప్తిలో ఉన్న నేతలు చాలామందే ఉన్నారు. అలాంటి వారికి సీట్ల పెంపుతో అవకాశం దక్కడం పక్కా. కూటమిగా వెళ్లినా సొంత పార్టీ నేతలకు టికెట్ల కేటాయింపు చంద్రబాబుకు ఈజీ కానుంది. గత ఎన్నికలప్పుడు సీట్ల పంపకాల కోసం పడ్డ ఇబ్బందులు ఈసారి ఉండకపోవచ్చు.ఇక 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ సీట్లలో పోటీ చేసి గెలిచి వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన జనసేన వచ్చే ఎన్నికల కోసం ఇప్పటినుంచే సమాయత్తం అవుతోంది. యువతకు ఎక్కువ అవకాశాలు ఇచ్చే యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీ, లోక్ సభ సీట్ల పెంపు జనసైనికులకు వరంగా మారే అవకాశం ఉంది. అయితే టీడీపీతో పొత్తులో ఉండటంతో తమకు రాజకీయ అవకాశాలు దక్కవేమోనన్న ఆందోళనలో ఉన్న పలువురు జనసేన నేతలకు గతంలోనే క్లారిటీ ఇచ్చారు పవన్.రిజర్వేషన్లు, స్థానిక పరిస్థితులు, పొత్తులను బట్టి టికెట్లు



వస్తాయి. సీటు రాని వారికి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయంటూ భరోసా ఇచ్చారు. అలా ఆయన మాటే శాసనంగా జనసేన కోసం పని చేస్తున్న వారికి సీట్ల సంఖ్య పెంపు స్వీట్ న్యూస్‌గా మారనుంది. గత ఎన్నికల్లో జనసేన నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన 21 మందిలో ఎక్కువ మంది కొత్త వాళ్లే. పైగా కార్యకర్త స్థాయి నేతలకు టికెట్ ఇచ్చి చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కల్పించారు పవన్. రాబోయే ఎన్నికల్లో మరింత మంది యువ నేతలకు అవకాశాలు దక్కనున్నాయి. పైగా మహిళ రిజర్వేషన్లు అమల్లోకి వస్తే వీర మహిళలకు సీట్లు దక్కనున్నాయి. దీంతో ఇప్పుడు అందరి చూపు జనసేన వైపు అన్నట్లుగా మారిపోయింది సీన్.జనసేనలోకి వెళ్తే సీటు గ్యారెంటీ. ఇప్పుడీ ఈక్వేషన్ ఏపీ పాలిటిక్స్‌లో తెగ ఇంట్రెస్టింగ్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశపడుతున్నవారికి జనసేన బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోందట. ఈసారి పొత్తులో భాగంగా జనసేనకు గతంలో కంటే డబుల్, ట్రిపుల్ సీట్లు దక్కుతాయని ఆశావహులు లెక్కలేసుకుంటున్నారు. ఏపీ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 269కి చేరితే జనసేనకు యాభై నుంచి డెబ్బై ఎమ్మెల్యే సీట్లు దక్కుతాయనేది కొందరి అంచనా. ఇక లోక్‌సభ సీట్లు 38కి పెరిగితే..జనసేన పది దాకా లోక్‌సభ సీట్లలో పోటీ చేసే ఛాన్స్ ఉందనేది ఇంకో లెక్క. ఈ క్రమంలో ఇప్పటి నుంచే జనసేనలో చేరి జనంలోనూ, పవన్ దృష్టిలోనూ పడితే టికెట్ తమకే దక్కుతుందని..వన్స్ పార్టీ బీఫామ్ దక్కితే గెలుపు ఈజీ అవుతుందని మాస్టర్ ప్లాన్ వేసుకుంటున్నారట పలువురు నేతలు.జనసేన తలుపులు తెరిస్తే చాలు గాజు గ్లాస్‌లో టీ తాగేందుకు తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారట పలువురు లీడర్లు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన నేతలు..జనసేనవైపు చూస్తున్నారట. అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల పెంపు జనసైనికులకు, జనసేనకు నయా జోష్ తెస్తుందన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది.

# 11 నగరాల్లో ఈ బస్ సౌకర్యం

**తిరుపతి, మార్చి 26, పెన్ పవర్:** ఏపీకి కేంద్రం నుంచి ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. కేంద్రం అందిస్తోన్న పీఎం ఈ-బస్ సేవా పథకంలో భాగంగా మొదటి దశలో 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయని సీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పీఎం ఈ బస్ సేవా ఫథకం పూర్తి స్థాయిలో వినియోగానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు త్వరలోనే 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయన్నారు సీఎస్ సాయిప్రసాద్. ఈ విద్యుత్ బస్సులకు అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కేంద్రం ఏపీకి పీఎం ఈ బస్ సేవా పథకం కింద 750 బస్సులు కేటాయించిందన్నారు.. వీటిని రాష్ట్రంలోని 11 నగరాల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సీఎస్ సూచించారు. ఈ బస్సుల్ని నడిపేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు సీఎస్.

రాష్ట్రంలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తే.. ఇంధన పొదుపుతో పాటుగా కాలుష్యం నియంత్రణలో ఉంటుందన్నారు. విద్యుత్ బస్సులకు కావాల్సిన మౌలిక వసతుల కోసం మొత్తం 12 డిపోల పరిధిలో 129.51 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు రవాణాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు. ఈ నిధుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రం



40శాతం భరిస్తున్నాయ్నారు. ఈ విద్యుత్ బస్సుల్ని విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు నగరాల్లో ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు ఆర్టీసీ అధికారులు. ఇప్పటికే తిరుపతిలో 100 విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో 15 ఏళ్లు దాటిన బస్సులను పూర్తిగా తొలగించాలని సీఎస్ అధికారులకు సూచించారు.మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారందరికి ఎస్‌బీఐ జనరల్ హెల్త్ ఇన్సూరెన్సుథకం ప్రారంభమైంది. ఆర్టీసీ ఎండీ ఎన్.బాలసుబ్రమణ్యం బ్రోచర్, సర్క్యులర్‌ను ఆవిష్కరించారు. ఈ బీమా పథకం ద్వారా ఆకస్మికంగా అనారోగ్య పరిస్థితుల్లో ఉద్యోగులపై ఆర్థిక భారం పడకుండా, మెరుగైన చికిత్స పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు ఎండీ. దీనిలో కూడా రెండు పథకాలు (సాప్‌హైర్ క్లాసిక్ పాలసీ, సాప్‌హైర్ సూపర్ టాప్‌అప్ పాలసీ) ఉన్నాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఈ రెండింటిలో ఏదైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్టీసీ ఉద్యోగి, భార్య/భర్త, వారి ఇద్దరు పిల్లలు వైద్యం పొందొచ్చు. ఈ పాలసీలో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కవరేజ్.. ఒకసారి చేరితే, ఉద్యోగ విరమణ తర్వాత కూడా కొనసాగించొచ్చు.

## కనిపించని సమన్వయం

**విశాఖపట్టణం, మార్చి 26, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఈసారి కూడా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లను ఖరారు చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు 263కు పెరుగుతుండటంతో కనీసం రెండు వందల స్థానాలకు కాస్త అటు ఇటుగా టీడీపీ పోటీ చేసే అవకాశముంది. అయితే ప్రస్తుతమున్న అనుభవంతో ఈసారి మాత్రం పార్టీ విధేయులకు పట్టం కట్టాలని యోచిస్తున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో యువకులు, సామాజికవర్గంతో పాటు, వారి ఆర్థిక స్థితిని చూసి టిక్కెట్లను కేటాయించారు. అయితే అది చాలా వికటించింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచి గాడి తప్పుతున్నారు.వేసిన అంచనాలకు వారి పనితీరుకు మధ్య పొంతన లేకుండా పోయింది. సీనియర్ నేతలను పక్కన పెట్టి కొంత తప్పు చేశామని ఇప్పుడు పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడింది. కొత్తగా వచ్చిన నేతలకు పార్టీ పట్ల కమిట్ మెంట్ లేకపోవడంతో పాటు క్యాడర్ ను దగ్గరకు తీసుకోకపోవడంతో పాటు తమ వ్యాపారాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు స్పష్టంగా తమకు అందుతున్న వివిధ సంస్థలు, నిఘా నివేదికల ద్వారా అందుతున్నాయి.ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అయినా చాలా మందిలో మార్పు రావడం లేదు.తాము మొదటి సారి గెలిచి మోనార్క్ లమని భావిస్తూ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేరవేయడం లేదన్నది నిర్ధారణ అయింది. అందుకే ఈ సారి ట్రాక్ రికార్డు చూసిన తర్వాత మాత్రమే టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్ లు దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. నియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఏర్పడటంతో ఈసారి అభ్యర్థుల ఎంపికలో దిద్దుబాటు చర్యలతో పాటు సీనియర్ నేతలకుకూడా అవకాశాలు కల్పించడంపై నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. మరి ఎన్నికల నాటికి అందే నివేదికలను బట్టి నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

## సిద్ధం కానీ చిన్నస్వామి స్టేడియం.. ఆర్సీబీ VS ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ జరిగేది డౌటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ( ఐపీఎల్) 2026 సీజన్ కేవలం రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్‌కు వేదికైన ఎం. చిన్నస్వామి స్టేడియం ఇంకా సిద్ధం కాలేదని సమాచారం. ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో నివేదిక ప్రకారం.. ఈ మ్యాచ్‌కు కేవలం రెండే రోజుల సమయం మాత్రమే ఉన్నా, స్టేడియం ఇంకా 'నిర్మాణ ప్రాంతం'లా కనిపిస్తోంది. మైదానం సిద్ధంగా ఉన్నప్పటికీ, స్టేడియం లోపల వడ్రంగులు, మేస్త్రీలు, కాంట్రాక్టర్లు ఇంకా పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది. గ్రౌండ్ ప్రవేశ ద్వారాల దగ్గర ప్లైవుడ్ షీట్లు, నిర్మాణ సామాగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటం కనిపిస్తున్నాయి. గతేడాది జూన్ 4వ తేదీన జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించడంతో, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (KSCA) ఫ్యాన్ సెక్షన్లు, ఎగ్జిట్ పాయింట్ల వద్ద భారీగా మార్పులు చేపట్టింది. వాస్తవానికి ఈ పనులన్నీ మార్చి 15వ తేదీ నాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేసిన మార్పుల వల్ల ఇంకా పనులు జరుగుతున్నాయి. గత నాలుగు రోజులుగా మేము నిద్ర కూడా పోలేదని అక్కడ పని చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి గౌరవార్థం, ఈ ఏడాది ఐపీఎల్ ప్రారంభ వేడుకలను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. కానీ మే 31వ తేదీన జరిగే ఫైనల్ రోజున గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నామని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఒకవైపు నిమిషాల వ్యవధిలోనే టిక్కెట్లు అమ్ముడైపోగా, మరోవైపు స్టేడియం పనులు ఇంకా పూర్తికాకపోవడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. మార్చి 28వ తేదీన జరగబోయే మ్యాచ్ సమయానికి స్టేడియం పూర్తిగా ముస్తాబవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# టైటిల్ వేటలో సన్‌రైజర్స్ హైదరాబాద్.. జట్టు బలం, బలహీనతలు ఇవే



**హైదరాబాద్ పెన్ పవర్:** మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురి పెట్టింది. చివరగా డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో 2016లో ఎస్ఆర్‌హెచ్ టైటిల్ అందుకుంది. అనంతరం 2018, 2024 సీజన్లలో ఫైనల్ వరకు వెళ్లినా విజేతగా నిలవలేదు.. గతేడాది పేలవ ప్రదర్శనతో 6వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శనతో టైటిల్ కొట్టాలనే కసితో ఉంది. ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడంతో టీమ్ కి గట్టి షాక్ తగిలింది. విధ్వంసకరమైన బ్యాటింగ్ ఉన్నా, బౌలింగ్ విభాగం మాత్రం బలహీనంగా కనిపిస్తుంది. కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరు కనిపించడం లేదు?.. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే పేసర్ ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిలిగిపోయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ 250o పరుగులు చేసినా మ్యాచ్ గెలిచే ప్రసక్తి లేదని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఇప్పటికే చెప్పాడు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉంటే, ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు అవుతాయి.. కానీ జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. గత ఎడిషన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను బాగా దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే టాక్ వినిపిస్తుంది. గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో విజయం సాధించినా.. స్లో వికెట్స్‌పై దారుణంగా ఓడింది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై ఎస్ ఆర్ హెచ్ బ్యాటర్లు విఫలం కాగా, బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు.

ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను మినీ వేలంలో దక్కించుకుంది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా వంటి వారిని కొనుగోలు చేసింది. కానీ ఇందులో మెజార్టీ ప్లేయర్స్ కి ఒక్క ఐపీఎల్ మ్యాచ్ ఆడిన అనుభవం కూడా లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన చేసినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరిపోయినట్లే.. లేదంటే ఈసారి కూడా జట్టు ప్లే ఆఫ్స్ చేరకుండా కష్టమే అని చెప్పాలి.

## సొంతగడ్డపై టీమిండియా 2026-27 షెడ్యూల్ ఇదిగో... హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుభవార్త అందించింది. 2026–27 సీజన్‌కు సంబంధించి టీమిండియా స్వదేశంలో ఆడనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ఈ సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌లో కొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే, ప్రతిష్టాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గౌహతిలోని బర్సపరా స్టేడియం మొదటిసారి ఒక టెస్ట్ మ్యాచ్ నిర్వహించనుంది.

షెడ్యూల్ వివరాల్లోకి వెళ్తే, ఈ హోమ్ సీజన్ వెస్టిండీస్ పర్యటనతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ టూర్‌లో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. వన్డేలకు త్రివేండ్రం, గౌహతి, న్యూ చండీగఢ్ ఆతిథ్యం ఇస్తుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు నగరాలు టీ20 మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి.

ఆ తర్వాత, డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. డిసెంబర్ 13 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉంటాయి. వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లలో జరగనుండగా.. రాజ్‌కోట్, కటక్, పుణేలలో టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

కొత్త ఏడాది ఆరంభంలో, జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంతో హైదరాబాద్ నగరానికి ఈ సీజన్‌లో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు దక్కినట్లయింది. ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా, అభిమానులు ఎంతగానో ఎదురుచూసే బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ నిలవనుంది. జనవరి 21 నుంచి మార్చి 3 వరకు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. నాగ్‌పూర్‌లో తొలి టెస్టు ప్రారంభం కానుండగా, ఆ తర్వాత చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్‌లలో మిగిలిన మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచంలోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య జరిగే ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సుదీర్ఘ షెడ్యూల్ దేశంలోని క్రికెట్ అభిమానులకు అసలైన పండగను తీసుకురానుంది.



నేహా శెట్టి పీచ్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

# పెద్ది చుట్టూ మూడు 'సవాళ్లు'.. ఏం జరుగుతుందో?

టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం నటిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. ఆ సినిమాపై ప్రస్తుత పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చగా మారింది. ముఖ్యంగా ఏప్రిల్ 30న విడుదల నేపథ్యంలో మూడు విషయాలు ఆ చిత్రానికి సవాళ్లుగా నిలుస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. అసలేమైంది? అవేంటి?



మొదటిది.. మిడిల్ ఈస్ట్ లో కొనసాగుతున్న ఇజ్రాయెల్– అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం. యుద్ధ వాతావరణం కారణంగా ఇంటర్నేషనల్ మార్కెట్ లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉంది. అందుకే రవాణా ఖర్చులు పెరగడం వల్ల సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్యపై ప్రభావం పడే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.ఇదే పరిస్థితి నెల రోజులు కొనసాగితే, పెద్ది సినిమా థియేట్రికల్ కలెక్షన్లపై కూడా ఆ ఎఫెక్ట్ పడొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో రెండో సవాల్ విషయానికొస్తే.. బాలీవుడ్ చిత్రం ధురంధర్ 2. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లు సాధిస్తూ, ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల ఖర్చు సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది.ఫిబ్రవరిలో సంక్రాంతి సినిమాలపై భారీగా ఖర్చు చేసిన ప్రేక్షకులు తర్వాత కొంత కాలం సినిమాలకు దూరంగా ఉన్నట్లు, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడవచ్చని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో బ్యాండ్ మేళం, డెకాయిట్, బైకర్, స్వయంభూ వంటి చిన్న, మీడియం రేంజ్ చిత్రాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటే, ఏప్రిల్ చివరికి ప్రేక్షకుల ఖర్చు కోసం ఆలోచించే అవకాశం ఉంది.ముఖ్యంగా ఇప్పుడు మూడో సవాల్.. ఐపీఎల్. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆ టోర్నీ క్రేజ్ హై లెవెల్ లో ఉంటుంది. ముఖ్యంగా ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు కొత్త యజమానులతో భారీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ రెండు ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి, తమ జట్లను మరింత అట్రాక్టివ్ గా మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. దీంతో ప్రేక్షకుల దృష్టి ఎక్కువగా క్రికెట్ పైనే ఉంటోంది.టెలివిజన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో ఐపీఎల్ మ్యాచ్ లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండటంతో, సినిమాలకు తగిన స్పేస్ దక్కకపోవచ్చని ప్రచారం జరుగుతోంది. అలా మూడు సవాళ్ల మధ్య పెద్ది రిలీజ్ అవుతోంది. అయినప్పటికీ రామ్ చరణ్ స్టార్ డమ్, సినిమాపై ఉన్న అంచనాలు, కంటెంట్.. అన్నీ కలిసి ఆ అడ్డంకులను అధిగమించగలవా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పెద్ది ఎలా రాణిస్తుందోననేది హాట్ టాపిక్ గా మారింది. ప్రేక్షకుల రెస్పాన్స్, మౌత్ టాక్, ఓపెనింగ్ కలెక్షన్లే సినిమా ఫ్యూచర్ ను డిసైడ్ చేయనున్నాయనే చెప్పాలి.



ప్రియాంక జవాల్కర్ గోల్డెన్ అవర్ గ్లామ్ లుక్‌లో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com